



వరంగల్ కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్స్ డే సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థులు



హనుమకొండ కలెక్టరేట్‌లో ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, రేవూరి

# ఘనంగా గురుపూజోత్సవం

**ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు**

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం గురుపూజోత్సవాన్ని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అన్ని విద్యాసంస్థల్లో గురువులను పూలమాలలు, శాలువాలతో విద్యార్థులు సన్మానించి ఆటపాటలతో సందడి చేశారు. అలాగే కలెక్టరేట్లలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు సత్కరించి పురస్కారాలు, జ్ఞాపికలు అందించారు. కాలానుగుణంగా విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా వారి భవ్యషత్తును తీర్చిదిద్దాలని వారు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





- మేడారం అటవీ ప్రాంతంలో ఊహకందని విధ్వంసం
- 200 హెక్టార్లలో నేలకొరిగిన వృక్షాలు
- విరిగిపడిన 16 విద్యుత్ స్తంభాలు
- అటవీ ప్రాంతమైనందున తప్పిన ప్రాణనష్టం
- వాతావరణ మార్పులే కారణమంటున్న పరిశోధకులు

# వన విలాపం..

రాష్ట్రమంతటా భారీ వర్షాలు కురుస్తున్న వేళ .. ప్రకృతి ప్రకోపానికి మేడారం అటవీ ప్రాంతం ఊహకందని విధ్వంసానికి గురైంది. విదేశాల్లో మాత్రమే వెలుగుచూసే టోర్నడో తరహా సుడిగాలులతో ఎన్నడూలేని విధంగా అరుదైన, అసాధారణ రీతిలో వనమంతటినీ ఒక్క ఉదుటున నేలకూల్చేసి అందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ప్రకృతి విలయతాండవానికి 500 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెట్లన్నీ ఎవరో కొట్టేసినట్టు ఒకవైపే పడిపోగా, 16 విద్యుత్‌స్తంభాలూ నేలకూలాయి. రాష్ట్ర అటవీ శాఖ చరిత్రలో కనీవినీ ఎరుగని సంఘటన ఈ నెల 1న తెల్లవారుజామున ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరుగగా విధ్వంసానికి కారణాలేమిటనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. అయితే వాతావరణ మార్పులే దీనికి కారణమై ఉంటుందని శాస్త్రీయ దృక్పథంతో నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని పరిశోధకులు, పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

*- ములుగు, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ)/ తాడ్వాయి*

## పచ్చని అడవిపై ప్రకృతి ప్రకోపం

పీడనం ఎక్కువైనప్పుడు గాలి ప్రయాణించే మార్గంలో అడ్డు వచ్చిన వాటిని కూల్చివేస్తుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. 13 ఏళ్ల క్రితం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఇలాంటి విపత్తు కారణంగా 1200 ఎత్తైన టేకు చెట్లు పడిపోయాయని.. కానీ రాష్ట్ర చరిత్రలోనే ఇంతటి విధ్వంసం ఇదే మొదటిదని అంటున్నారు. అయితే అటవీ ప్రాంతం అయినందున ప్రాణనష్టం తప్పిందని.. ఒక విధంగా అడవి ప్రజల ప్రాణాలను కాపాడిందని అభిప్రాయపడుతున్నారు. విదేశాల్లో అప్పుడప్పుడు వచ్చే టోర్నడో, హరికేన్ వంటి ప్రకృతి విలయాలు తెలంగాణ అటవీ ప్రాంతంలో చోటుచేసుకోవడం ఇదే తొలిసారని అధికారులు, పర్యారణ పరిరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రకృతి విలయానికి నేలకొరిగిన వృక్షాలు

## శాస్త్రీయ దృక్పథంతో నష్టనివారణ చర్యలు చేపట్టాలి



మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న నష్టాన్ని మనం నిత్యం అతివృష్టి, అనావృష్టిల రూపంలో చూస్తున్నాం. అయినా మన ప్రవర్తనలో మార్పు రావడం లేదు. గత కొద్దిరోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వానలు, జరుగుతున్న నష్టాన్ని మనం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. దానికి తగ్గట్టుగా మార్పులు చేసుకుంటూ వెళ్తున్నాం. కానీ శాశ్వత ప్రాతిపదికన ఆలోచించడం లేదు. ఇటీవల ఏటూరునాగారం అభయారణ్యంలో 200హెక్టార్లలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం పూర్తిగా దెబ్బతినడం ఆందోళనకరం. ఇలాంటి ఘటన మన దగ్గర ఎన్నడూ జరగలేదు. కొన్నిచెట్లు పూర్తిగా వేర్లతో కిందపడిపోగా, మరికొన్నింటి కొమ్మలు పూర్తిగా, పాక్షికంగా విరిగి మోడులు మాత్రమే మిగిలాయంటే ఎంత నష్టం జరిగిందో మనం ఊహించడానికి కూడా సాధ్యం కాదు. ఇక్కడ మనం ఒక్క చెట్ల గురించి మాత్రమే మాట్లాడుకోవడం తప్పు. ఎందుకంటే ఈ వనాలను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న పక్షులు, సరీసృపాలు, క్రిములు, కీటకాలు, వాటి తరాలు, ఇతరత్రా జీవులు, వాటి మధ్య చెదిరిపోయిన సంబంధాలపై కూడా ఆలోచించాలి. ఈ జీవరాశుల సమాహారమే అటవీ వ్యవస్థ. వీటన్నింటికి నివాసయోగ్యమైన, అనుకూల పరిస్థితులు సృష్టించాలంటే అసాధ్యం. కానీ, ఎంతో కొంత అనుకూల పరిస్థితులు సృష్టించాలంటే చాలా శాస్త్రీయ దృక్పథం కావాలి. దీనికి వృక్ష, జంతుశాస్త్ర నిపుణులతో వెంటనే ప్రాథమిక క్షేత్ర అధ్యయనం చేయాలి. అడవిని నష్టపోయిన ప్రాంతంలో ఎలాంటి మొక్కలు, ఎప్పుడు, ఎలా పెట్టాలనే విషయం మీద స్పష్టమైన అవగాహన అవసరం. విధిగా నల్లమద్ది, తెల్లమద్ది, ఉసిరి, నారేప, మారేడు, ఇప్ప, సండ్ర, తెల్లతుమ్మ, బండారు, బుడధర్మి, మొర్రి, పాల, తీగమోదుగ, రేల, బూరుగు, బిల్లుడు, కొడిశ, జిట్రేగు, పచ్చరి, బాడిద, గరుగ, గుమ్మడి టేకు, బొంగు (వెదురు), పాలవరేని, దుంపెన, చిలుకదుద్దు, ఎగిస, జీడీ, చిల్ల, విషముష్టి, తునికి, టేకు, తానిక్కాయ, కరక్కాయ, బొజ్జ లాంటి దేశీయ, స్థానిక మొక్కలను మాత్రమే నాటాలి. వీటిని నర్సరీల్లో పెంచడానికి కావాల్సిన విత్తనాలను త్వరితగతిన సేకరించి, వెంటనే పెంచే ప్రక్రియ చేపట్టాలి. జరగాల్సిన నష్టం జరిగింది. శాస్త్రీయ దృక్పథంతో నివారణ చర్యలు చేపట్టాలి.

**– సుతారి సతీశ్, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, కేన్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ**

# మ్యూజియంకు దారేది ?

## మడుగు ముందు పురావస్తు శాఖ మ్యూజియం



వరంగల్ ఉమ్మడి జిల్లా పురావస్తు శాఖ మ్యూజియం ముందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు భవన నిర్మాణం కోసం తీసిన గుంతలో నిండా చేరిన వరద నీరు

- పరిపాలన భవన నిర్మాణం కోసం తవ్వకం
- తాటిచెట్టు లోతుతో నీటితో నిండిన మడుగు
- అడ్డంకులతో అటువైపు చూడని సందర్శకులు
- ఉన్నతాధికారులకు లేఖలు రాసినా పట్టింపు లేదు
- మూతపడిన చారిత్రక మ్యూజియం

వరంగల్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లా పురావస్తు శాఖ మ్యూజియం నీళ్ల మడుగులో ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో మ్యూజియం మూతపడిన పరిస్థితి వచ్చింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) అడ్మినిస్ట్రేషన్ కొత్త భవన నిర్మాణం కోసం తీసిన గుంత చెరువును తలపిస్తున్నది. పురావస్తు శాఖ మ్యూజియం ముందే ఈ నీటి మడుగు ఉండడంతో అది మూతపడే పరిస్థితి వచ్చింది. మ్యూజియంలో పనిచేసే సిబ్బంది సైతం లోపలికి వెళ్లేందుకు దారి లేదు. అధికారికంగా మ్యూజియం నడుస్తున్నా విజిటర్లు రాకపోవడంతో మూతపడినట్లే ఉన్నది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఆఫీసు ఆవరణలో ఇండోర్ స్టేడియం ముందు కొత్త పరిపాలన భవనం నిర్మాణం కోసం హడావిడిగా జరిపిన తవ్వకంతో అక్కడ పెద్ద గుంతలా మారింది. చెట్ల పొదల మధ్య ఉన్న చిన్న కాలిబాట నుంచి ఉద్యోగులు, సిబ్బంది వెళ్లాల్సి వస్తున్నది. అడుగు పక్కకు పడితే తాటిచెట్టంత లోతున్న గుంతలో పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వర్షపు నీటితో నిండి ఉన్న ఈ గుంతలో కుక్కలు, పందులు పడి దుర్వాసన వస్తున్నది. నీటి గుంతలో పడిపోతామనే భయంతో ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుకోవానికి, జిమ్ చేయడానికి, వివిధ క్రీడల్లో శిక్షణ పొందే వారు రావడంలేదు. గుంత చుట్టూ ఎలాంటి కంచె లేకపోవడంతో ఇండోర్ స్టేడియం సైతం మూతపడే దుస్థితి నెలకొన్నది.

**1985లో శంకుస్థాపన**

మ్యూజియం నిర్మాణం కోసం 1985 మార్చి 29న అప్పటి గవర్నర్ శంకర్‌దయాల్ శర్మ శంకుస్థాపన చేశారు. 1987లో భవన నిర్మాణం పూర్తయ్యింది. ప్రాచీన వస్తువులు, కళాఖండాలను ప్రదర్శనలో ఉంచడానికి ఈ భవనంలో పెద్దహాల్, మూడు గదులు, ఎన్‌క్లోజ్‌డ్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని కాకతీయుల కాలం నాటి శిల్పాలు, విగ్రహాలు, రాజులు వినియోగించిన యుద్ధ సామగ్రితో పాటు నంది విగ్రహాలు, రాతి ఫిరంగులు మ్యూజియంలో ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని చారిత్రక, వారసత్వ సంపద ఎక్కడ దొరికినా ఇందులోనే పెడతారు. దీని పక్కనే నక్షత్రశాల, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ కూడా ఉండడంతో విజిటర్లతో ఈ ప్రాంతం రద్దీగా ఉండేది. అవి రెండూ మూతపడటం.. నీటి గుంత ఉండడంతో మ్యూజియానికి కూడా ఇదే పరిస్థితి వచ్చింది. శిథిలావస్థకు చేరిన మ్యూజియంను ఖిలా వరంగల్‌లో కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్చాలని పురవాస్తు శాఖ జిల్లా అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులను కోరినా ఫలితం లేదు.

**నిర్మాణంలో తీవ్ర జాప్యం**

పురావస్తు శాఖ మ్యూజియంను వరంగల్ కోటలోని భవనంలోకి తరలించే ప్రక్రియలో జాప్యం జరుగుతున్నది. కోట సమీపంలో మ్యూజియం కోసం అన్ని హంగులతో విశాలమైన, అధునాతన భవనాన్ని నిర్మిసుండగా, ఆ పనులు సైతం నిలిచిపోయాయి. మ్యూజియంను అక్కడికి తరలిస్తే, కోటను సందర్శించేందుకు వచ్చిన వారు చూసేందుకు వీలువుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మ్యూజియానికి ప్రచారం కల్పిస్తే చారిత్రక అంశాలపై నేటి తరానికి అవగాహన కల్పించే అవకాశం ఉంటుంది.

# పరామర్శించి.. భరోసానిచ్చి..

- సీతారాంతండాను సందర్శించిన సత్యవతి రాథోడ్
- బోరున విలపించిన మహిళలను ఓదార్చిన మాజీ మంత్రి
- బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేత



కురవి: చిన్నారిని ఎత్తుకుని బాలింతతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



కురవి: ఇంటి ముందు ఆరబోసిన ఆహార దినుసులు

కురవి, సెప్టెంబర్ 5 : ఇటీవల కురిసిన వర్షాలకు ఆకేరు వాగు ముంచెత్తడంతో సర్వం కోల్పోయిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారంతండాను గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సందర్శించారు. తండా అంతా కలియదిరిగి జరిగిన విధ్వంసాన్ని పరిశీలించారు. ఆమెను చూడగానే తండా మహిళలు ఒక్కసారిగా భోరున విలపించడంతో 'మీకు ఇబ్బంది రాకుండా చూసుకునే బాధ్యత నాది.. వరద వచ్చిన రోజున నేను ఇక్కడ లేను. ఆ భగవంతుడు మనతో ఉన్నందునే ప్రాణనష్టం జరగలేదు. మీకు జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు' అంటూ వారిని అక్కున చేర్చుకొని ఓదార్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాజకీయాలకతీతంగా ఈ ప్రాంతానికి సహాయపడాలని గిరిజన బిడ్డగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలకు నెలరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు.

**నీ కొడుకు మృత్యుంజయుడు**

తండాలోని బాధితులను పరామర్శిస్తున్న క్రమంలో గుగులోత్ హన్మంతు ఇంటికి వెళ్లగా సత్యవతి రాథోడ్‌కు బాలింత కనిపించింది. వెంటనే ఆమెను కొడుకా.. బిడ్డా అంటూ అడిగింది. ఆ సమయంలో బాలింత అత్త పారు సత్యవతి రాథోడ్‌పై పడి భోరున విలపించింది. 'నా కొడుకు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కోడలు శిరీష గొడవల వల్ల ఇంటి వద్దనే రెండు నెలల కింద ప్రసూతి అయ్యింది. ఆదివారం తెల్లవారుజామున నీళ్ల వచ్చే సమయంలో చుట్టు పక్కల వాళ్లు బాబును గంపలో పెట్టుకొని, కోడలును పట్టుకొని దగ్గరలోని డాబా ఎక్కించారు' అంటూ సత్యవతికి వివరించింది. ఆ బాబును ఎత్తుకున్న సత్యవతి 'నీ కొడుకు మృత్యుంజయుడమ్మా.. బాధపడకు.. నువ్వు ఆ సమయంలో పడిన కష్టం వృధా కాదు' అంటూ ఓదార్చింది.

**సాయం అందించిన స్వచ్ఛంద సంస్థలు**

మహబూబాబాద్‌కు చెందిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో 40 మందికి నిత్యావసర వస్తువులు, మహబూబాబాద్ జీన్స్ కార్నర్ సహకారంతో 100 మందికి బట్టలు, ఇల్లందుకు చెందిన జై గణేశ్ ట్రేడర్ సహకారంతో 50 మందికి దుస్తులు, 30 కిలోల పులిహోర అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ జె నవీన్‌కుమార్, సెక్రటరీ కే లీలావతి, యాదగిరి, సుజాత, పద్మావతి, ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు. కిసాన్ పరివార్ సేవాసమితి ఆధ్వర్యంలో 16 మందికి నిత్యావసరాలను సీతావో డాక్టర్ వివేక్ అందజేశారు. వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు రవి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలను అభినందించారు. కార్యక్రమంలో విష్ణు, బీమానాయక్, మంగీలాల్, వెంకన్న, రాంమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వరదకు కొట్టుకుపోయిన పురుషోత్తమాయగూడెం 365 జాతీయ రహదారిని మరమ్మతు పనులను అధికారులు పూర్తిచేశారు. మట్టి పోసి రోడ్డు రోలర్‌తో తొక్కించి రాకపోకలకు అనువుగా తయారుచేశారు. శుక్రవారం నుంచి వాహనాలు ప్రయాణించనున్నాయి.



హర్జ్యతండాలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# ఇక అంగన్‌వాడీల్లో ప్రాథమిక విద్య

- ఈ నెల 9న హర్జ్యతండాలో శ్రీకారం
- సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభం
- కలెక్టర్ సత్య శారద

గీసుగొండ, సెప్టెంబర్ 5: ఇకపై పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రాథమిక విద్యను అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కలెక్టర్ సత్య శారద అన్నారు. గురువారం ఆమె మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని హర్జ్యతండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా హర్జ్యతండా సెంటర్‌ను ఎంపిక చేసినట్లు ఆమె చెప్పారు. ఈ నెల 9న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్య అమలు కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో ప్రారంభిస్తారని వివరించారు. ఈ మేరకు జిల్లాలోని హర్జ్యతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ సెంటర్‌లో 12 మంది పిల్లలున్నారని, మూడో తరగతి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే విద్యను అందిస్తారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్‌తోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించే ఆవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ స్టేట్ జాయింట్ డైరెక్టర్ అకేశ్వర్‌రావు, పోషణ అభియాన్ స్టేట్ కన్సల్టెంట్ శివాల్కర్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్, సీడీపీవోలు విశ్వజ, డేబోరా, తహసీల్దార్ రీయాజుద్దీన్, ఇన్‌చార్జి ఎంపీడీవో కమలాకర్, ఆర్ఐ సాంబయ్య, అంగన్‌వాడీ టీచర్ సరోజన తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన అయోధ్య చెరువు కుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

# రైతులను ఆదుకోవడంలో సర్కారు విఫలం


- పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలి
- ఎమ్మెల్సీ రవీందర్‌రావు డిమాండ్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్5 : అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని.. వెంటనే వారికి పరిహారం అందించాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు డిమాండ్ చేశారు. వర్షాలతో అతలాకుతలమైన అయోధ్య గ్రామాన్ని గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారీ వర్షాల వల్ల అనేక చోట్ల చెరువులు, కుంటలు తెగి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ మండలంలో 87 చెరువులు, కుంటలు తెగినట్లు సమాచారం ఉందని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయిని రంజిత్ కుమార్, రవికుమార్, మంగళంపల్లి కన్న, తేళ్ల శ్రీను ఉన్నారు.

# ఆత్మకూరు మున్సిపాలిటీ వద్దు

## ఆరు గ్రామాల ప్రజల తీర్మానం

ఆత్మకూరు, సెప్టెంబర్ 5 : ఆత్మకూరు మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గురువారం ఆరు గ్రామాల్లో సభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించాలని గ్రామ ప్రత్యేకాధికారులకు సర్క్యులర్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేకాధికారులు సభలు నిర్వహించారు. కామారం, నీరుకుళ్ల, గూడెప్పాడ్, ఆత్మకూరు, తిరుమలగిరి, పెంచికల్‌పేట గ్రామాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు 'గ్రామ పంచాయతీలే ముద్దు.. మున్సిపాలిటీ వద్దు' అంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మాన ప్రతులను గ్రామ ప్రత్యేకాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు క్రాంతికుమార్, జితేందర్‌రెడ్డి, లావణ్య, మంద శ్వేత, అనూష పాల్గొన్నారు.



పెంచికల్‌పేట గ్రామ సభలో 'గ్రామ పంచాయతీ ముద్దు–మున్సిపాలిటీ వద్దు' అంటూ తీర్మానం చేసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

# ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి

## అప్, డౌన్ ట్రాక్‌లపై కొనసాగుతున్న రైళ్ల రాకపోకలు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం–ఇంటికన్నె మధ్య డౌన్ లైన్‌లో నిర్వహిస్తున్న ట్రయల్ రన్

కేసముద్రం, సెప్టెంబర్ 5 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం–ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య ఎట్టకేలకు రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల వచ్చిన వరదలకు 418 కిలోమీటర్ రాయి వద్ద ట్రాక్ ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నెల 1న సాయంత్రం నుంచి రైల్వే అధికారులు వందల మంది కూలీలు, భారీ యంత్రాల సాయంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా, బుధవారం అప్ లైన్ ట్రాక్ పనులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలు ప్రారంభించారు. కాగా, గురువారం ఉదయం డౌన్ లైన్ ట్రాక్ పనులను సైతం పూర్తి చేసి మొదట గూడ్స్ రైలు ద్వారా ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం గోల్కొండ, కృష్ణ, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లను పంపించారు. దీంతో రెండు ట్రాక్‌లపై రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ కొన్ని రోజుల పాటు ఈ ప్రాంతంలో రైళ్ల వేగాన్ని తగ్గించి నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

**వరంగల్ మీదుగా పలు రైళ్లు రద్దు**

ఖిలావరంగల్ : భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ మేరకు గుంటూరు–సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – విశాఖపట్టణం వందే భారత్, సికింద్రాబాద్–భద్రాచలం రోడ్డు వెళ్లే రైళ్లను రద్దు చేయగా, మరి కొన్నింటిని పునరుద్ధరించినట్లు తెలిపారు.